Office Of The Advisor (communications)
Govt. Of Andhra Pradesh

# ఏడాదిలోగా అవిలాల ఉద్యానం

# బృహత్తర ప్రణాళికకు ముఖ్యమంత్రి ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 27 : తిరుపతికే ముఖ్య అలంకారంగా నిలిచే అవిలాల ఎకోలాజికల్ పార్కు బృహత్తర ప్రణాళికకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమోదం తెలిపారు. ఏడాది వ్యవధిలోగా దీన్ని పూర్తిచేసి పర్యావరణ ప్రేమికులు, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఉండవల్లిలో తన నివాసం పక్కనే ఉన్న గ్రీవియెన్స్ సమావేశ మందిరంలో మంగళవారం రాత్రి ఏపీ అర్బన్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చేపట్టిన పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు.

ఎత్తయిన పర్వతాలు, అడవుల నడుమ చక్కటి రహదారి మార్గంతో ఈ ఉద్యానవనాన్ని తీర్చిదిద్దుతారు. అందులోనే రిసోర్స్ సెంటర్, సైకిల్ సవారీకి ప్రత్యేక మార్గాలు, సైకిళ్లను అందించేందుకు ఎక్కడికక్కడే స్టేషన్లు, సౌర ఇంధనాన్ని వినియోగించుకునే పెవిలియన్స్, పర్యావరణ వంతెనలు, అవుడ్డోర్ క్లాస్‌రూములను ఏర్పాటు చేస్తారు. ఉద్యానవనం మధ్యలో 4,500 మంది ప్రజలు కూర్చొనేందుకు వీలుగా 'గరుడ గార్డెన్' పేరుతో ప్రత్యేక ఉద్యానాన్ని నెలకొల్పుతారు. లైట్ అండ్ సౌండ్ మ్యూజికల్ ఫౌంటెన్ కూడా ఇక్కడ వస్తుంది.

పార్కు చివరి భాగంలో అబ్జర్వేషన్ టవర్ నిర్మిస్తారు. ఇందులోనే మ్యూజియం, వ్యూపాయింట్, లాంజ్ ఏర్పాటు చేస్తారు. అన్ని నిర్మాణాల పైభాగంలో సౌర ఫలకాలను ఏర్పాటు చేసి పార్కు మొత్తానికి ఇక్కడి నుంచే సొంతంగా విద్యుత్ సరఫరా అందేలా చూస్తారు. ఈ ఉద్యానవనంలో క్రీడలు, వినోద సౌకర్యాలు, ప్రదర్శన కేంద్రాలు, శిల్పాలతో కూడిన తోటలు, కళలు,  చేతి వృత్తుల దుకాణాలు, ఆహార గ్రామాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

అవిలాల పరిసరాలలోనే తిరుమలలోని ఏడు కొండలను ప్రతిబింబించేలా 7 ఎత్తయిన శిఖర ప్రదేశాలను మేలైన జాతి వృక్షాలతో తీర్చిదిద్దుతారు. ఇక్కడే ఒక గోల్ఫ్ కోర్సును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. దీని వల్ల పార్కుకు వచ్చే పర్యాటకులు మరికొంత సమయం అక్కడే గడపడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. తిరుపతికే అలంకారంగా నిలిచే ఈ ప్రాజెక్టు పనులలో అత్యుత్తమ అర్కిటెక్టులు, ప్లానర్లు, పర్యావరణ వేత్తలు, వ్యర్థజలాల పునర్ వినియోగ నిపుణులు, ఇంజనీర్లను భాగస్వామ్యుల్ని చేయాలని, ఏడాది వ్యవధిలో అవిలాల ఉద్యానాన్ని పూర్తి చేసి ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని నగర, పట్టణ ప్రాంతాలలో చేపట్టిన  వివిధ ప్రాజెక్టుల పురోగతిని ఈ సమావేశంలో కార్పొరేషన్ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత 3 సంవత్సరాలలో చేపట్టిన మొత్తం 688 ప్రాజెక్టులలో 175 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. 21 శాతం ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. మరో 12 ప్రాజెక్టులు టెండర్ దశలో ఉన్నాయని అధికారులు వివరించారు. 200 కిలోమీటర్ల రహదారి మార్గంలో నిర్మించే సెంట్రల్ మీడియన్స్ పనులలో 144.3 కిలోమీటర్ల మేర పనులు ఇంతవరకు పూర్తిచేశామని చెప్పారు.

అలాగే, రాష్ట్రంలో మొక్కలు నాటే కార్యక్రమం 72 శాతం పూర్తయింది. వివిధ పురపాలక సంస్థల పరిధిలో మొత్తం 26 సెట్ల అవుట్ డోర్ ఫిట్‌నెస్ పరికరాలను అమర్చామని అధికారులు తెలిపారు. వీటి నిమిత్తం రూ.1.98 కోట్లు వ్యయం చేశారు. ముఖ్యమంత్రి సూచనల ప్రకారం విద్యుత్ లైన్లకు ఇబ్బంది లేకుండా, గ్రీనరీ దెబ్బతినకుండా విజయవాడ, విశాఖ, తిరుపతి నగరాలలో ఏపుగా పెరిగిన చెట్లను అవసరమైన మేర కత్తిరించి సంరక్షించే కార్యక్రమాన్ని చేపట్టారు. విజయవాడలో ఫ్లయ్‌వోవర్ పనులు జరుగుతున్న బెంజ్ సర్కిల్ ప్రాంతంలో ఇప్పటికే ఉన్న 273 వృక్షాలను సంరక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకున్నామని అధికారులు చెప్పారు.

పట్టణ ప్రాంతాల్లో ఉన్న వృక్షాలను లెక్కించడానికి వీలుగా డ్రోన్ సర్వే చేపట్టారు. తిరుమలలో గ్రీన్‌కవర్ మ్యాపింగ్ ఇప్పటికే విజయవంతంగా పూర్తిచేశారు. కాకినాడ, విశాఖపట్నంలో ప్రస్తుతం ఈ మ్యాపింగ్ సర్వే పురోగతిలో ఉంది. రాష్ట్రంలో గ్రీనరీని పెంపొందించడానికి తీసుకున్న చర్యలలో భాగంగా ఈ సర్వే జరుగుతోంది.

గుంటూరులో రూ. 15 కోట్ల వ్యయంతో 52 ఎకరాలలో చేపట్టిన ఎన్.టి.ఆర్ మానస సరోవర్ పార్కు, రూ. 9 కోట్ల అంచనాతో 6.35 ఎకరాలలో చేపట్టిన గాంధీ పార్కు, కర్నూలులో 123 ఎకరాలలో రూ. 15 కోట్ల వ్యయంతో ప్రారంభించిన సిటీ పార్కు పనులు ముమ్మరంగా జరుగుతున్నట్టు అధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరించారు.